# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 22 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## 28న రాష్ట్రానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- ఏర్పాట్లపై అధికారులతో సీఎస్ శాంతికుమారి సమీక్ష

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



ఈ నెల 28న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం సచివాలయంలో అధికారులతో సమావేశమై సమీక్షించారు. రాష్ట్రానికి తన ఒకరోజు పర్యటన సందర్భంగా రాష్ట్రపతి ఉదయం నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి హాజరవుతారని ఆమె తెలిపారు. అనంతరం సాయంత్రం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్‌ను రాష్ట్రపతి ప్రారంభిస్తారు. శాఖల మధ్య సంపూర్ణ సమన్వయం ఉండేలా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను కోరారు. అదేవిధంగా, విమానాశ్రయం, రాష్ట్రపతి నిలయం, అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక పరికరాలు ఏర్పాట్లు చేయాలని కోరారు. మిగితా 2వ పేజీలో

# జమిలి పేరుతో కుట్ర జరుగుతోంది..

## ఏచూరి ప్రేరణతో అడ్డుకుంటాం



- నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన నేత ఏచూరి
- సీతారాం ఏచూరితో మాట్లాడితే జైపాల్ రెడ్డితో మాట్లాడినట్టు ఉండేది
- సీతారాం ఏచూరి సంస్మరణ సభలో రేవంత్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జమిలి ఎన్నికల ముసుగులో బీజేపీ కుట్ర చేస్తోందని, దేశాన్ని కబళించాలని చూస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో సీపీఐ(ఎం) దివంగత నేత సీతారాం ఏచూరి సంస్మరణ సభలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరిపై రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

అనంతరం సీఎం మాట్లాడుతూ దేశంలో జమిలి ఎన్నికల పేరుతో పెద్ద కుట్ర జరుగుతోందని, ఇలాంటి సమయంలో ఏచూరి లేకపో వడంతో దేశానికి నష్టం కలుగుతోందన్నారు. అయినా వెనకడుగు వేయకుండా అందరం కలిసి సీతారాం ఏచూరి స్ఫూర్తితో బీజేపీ కుట్రకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

తాను పీసీసీ అధ్యక్షుడ్ని అయ్యాక రెండు సార్లు కలిశానని తెలిపారు. సీతారాం ఏచూరితో మాట్లాడితే జైపాల్ రెడ్డితో మాట్లాడినట్టు ఉండేదన్నారు. నమ్మిన సిద్ధాంతాల కోసం నిలబడే వారు చాలా అరుదని తెలిపారు. నేను ఈ దేశానికి అంకితం అని చాలా మంది ఉపన్యాసాల్లో చెబుతుంటారు కానీ ఆచరణలో కాదన్నారు. ఇక రాహుల్ గాంధీకి ఏచూరికి చాలా సన్నిహితంగా ఉంటారన్నారు. యుపిఎ -1,2 ఏర్పాటులో అనేక చట్టాలు తెచ్చినప్పుడు పేదలకు అనుకూలమైన నిర్ణయల్లో ఏచూరి పాత్ర ఎంతో ఉందన్నారు.

జమిలి ఎన్నికల ముసుగులో అధికారం కాపాడుకోవడానికి బీజేపీ ప్రయత్నాలు చేస్తుందన్నారు. జమిలి ఎన్నికల ముసుగులో దేశాన్ని కబళించాలని బీజేపీ చూస్తుందని మండిపడ్డారు. రాజ్యాంగ మార్పులు,.. సవరణలు విషయంలో బీజేపీ అవలం బిస్తున్న తీరు చూస్తున్నామన్నారు. యూనియన్ ఆఫ్ స్టేట్స్ స్పిరిట్ ను దెబ్బతీయాలని బీజేపీ చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా అందరూ పోరాడాలని పిలుపు ఇచ్చారు. ఇక రాహుల్ గాంధీ పై కేంద్ర మంత్రి రవణీత్ సింగ్ బిట్టు మాట్లాడిన మాటలపై మోదీ ఇప్పటికీ ఖండించలేదన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతపై అసభ్య భాష మాట్లాడిన మంత్రిపై చర్యలు తీసుకోకపోవడం మోదీ ఫాసిస్ట్ విధానాలకు నిదర్శనం అని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు

## ఐటీఐలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి.



- సీఎం రేవంత్ రెడ్డి
- కార్మిక, ఉపాధి కల్పన శాఖ అధికారులతో సమీక్ష

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చుతున్న నేపథ్యంలో ఎక్కడా సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ప్రతి ఐటీఐ కళాశాలలకు ప్రిన్సిపాళ్లు ఉండేలా చూడాలని, శిక్షణ తీసుకుంటున్న వారికి సమగ్రమైన శిక్షణ అందేలా జాగ్రత్త పడాలని సూచించారు. ఐటీఐ కళాశాలల పర్యవేక్షణ, తనిఖీలు క్రమం తప్పకుండా చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. కార్మిక, ఉపాధి కల్పన శాఖ అధికారులతో రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మార్కెట్ అవసరాలకు అనుగుణమైన కోర్సులను ఐటీఐ ప్రారంభించాలని సూచించారు. ఆయా కోర్సులకు అవసరమైన సిలబస్ రూపకల్పనకు ఓ కమిటీని నియమించి, నిపుణులు, విద్యావేత్తల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని ఆదేశించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ కొత్త ఏటీసీలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో ఐటీఐ/ ఏటీసీ లేని శాసనసభ నియోజకవర్గాలను గుర్తించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరం మినహా 100 నియోజకవర్గాల్లో ఐటీఐ/ఏటీసీలు ఉండేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. వృత్తి నైపుణ్యం అందించే ఐటీఐ/ఏటీసీ, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చేలా విధివిధానాలు రూపొందించాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బస్సులో ప్రయాణికుడికి గుండెపోటు..

- సీపీఆర్ చేసి కాపాడిన మహిళా కండక్టర్

బలగం టీవీ, హైదరాబాద్

ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడికి గుండెపోటురావడంతో అతడికి మహిళా కండక్టర్ సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకెళ్తే.. శనివారం జీడిమెట్ల ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు నర్సాపూర్ నుంచి గండిమైసమ్మ వైపు బయలు దేరింది. బస్సులో ఉన్న 67 ఏండ్ల ప్రయాణికుడు మురళీకృష్ణ గుండె నొప్పి వస్తోందంటూ కుప్పకూలిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ అంజలి.. వెంటనే డ్రైవర్ సైదులును అప్రమత్తం చేసి బస్సును ఆపించారు. మరో ప్రయాణికుడి సాయంతో అంజలి బస్సులోనే మురళీకృష్ణకు సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి మురళీకృష్ణ మిగితా 2వ పేజీలో



## 842 యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు

- పురుషులకు 421.. మహిళలకు 421
- నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ దవాఖాన్లలో 842 యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో 421 పోస్టులను మేల్ అభ్యర్థులతో, మరో 421 పోస్టులను ఫీమేల్ అభ్యర్థులను భర్తీ చేయనున్నట్టు పేర్కొంది. ఈ పోస్టులను కాంట్రాక్ట్ బేసిస్‌లో భర్తీ చేస్తున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మేల్ యోగా ఇన్‌స్ట్రక్టర్లు నెలకు కనీసం 32 యోగా సెషన్లకు అటెండ్ కావాలని, ఫీమేల్ యోగా ఇన్‌స్ట్రక్టర్లు నెలకు కనీసం 20 యోగా సెషన్లకు అటెండ్ కావాలని పేర్కొన్నారు. ప్రతి సెషన్ గంటసేపు ఉంటుందని, ఒక్కో సెషన్‌కు రూ.250 చొప్పున రెమ్యునరేషన్ చెల్లిస్తామని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు అటెండ్ కావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా ఆయుష్ హెడ్ క్వార్టర్స్‌లో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఈ నెల 24న ఆదిలాబాద్, హైదరాబాద్, 25న నిజామాబాద్, 26న మెదక్, రంగారెడ్డి, 27న వరంగల్, నల్గొండ, 28న కరీంనగర్, 30వ తేదీన ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లా హెడ్ క్వార్టర్ హాస్పిటల్‌లో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. పూర్తి వివరాల కోసం https://ayush.telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

# రూ. 8,888 కోట్ల అవినీతి

- అమృత్ పథకం టెండర్లలో కాంగ్రెస్ ప్రభుత్వం భారీ అవినీతి
- కేంద్రం విచారణ చేయాలి
- సీఎం బామ్మర్ది కంపెనీకి అర్హతలు లేకున్నా వేలకోట్ల రూపాయల పనులను ఎలా కట్టబెట్టారు ?
- 2 నెలల కిందనే ఈ కుంభకోణంపై మాట్లాడిన బీజేపీ శాసన సభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి ఎందుకు మూగబోయిండు?
- హైడ్రా సంస్థ పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

అమృత్ పథకం టెండర్లలో కాంగ్రెస్ ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే స్వయంగా అవినీతికి పాల్పడ్డారని, దీనిపై కేంద్రం విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. . కేంద్రం అమృత్ పథకం ద్వారా రాష్ట్రానికి కేటాయించిన దాదాపు రూ.1500 కోట్ల టెండర్లు సీఎం రేవంత్ రెడ్డి సొంత బావమరిది సుజన్ రెడ్డి కి చెందిన శోధ కంపెనీకి అర్హతలు లేకున్నా కట్టబెట్టారన్నారు. కాంగ్రెస్, బీజేపీల మధ్య ఎటువంటి సంబంధం లేకుంటే వెంటనే కేంద్రం విచారణ జరిపి నిజాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. రూ. 8,888 కోట్ల రూపాయల అమృత్ టెండర్ల కుంభకోణం గురించి సాక్షాలతో బయటపెడుతున్నాం అని కేటీఆర్ అన్నారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే.. ఫిబ్రవరి మొదటి వారంలో 8,888 కోట్ల రూపాయల భారీ అవినీతికి సీఎం రేవంత్ రెడ్డి తెరలేపారని కేటీఆర్ విమర్శించారు. తాను బాధ్యతలు నిర్వహిస్తున్న పురపాలక శాఖ కేంద్రంగా రేవంత్ రెడ్డి ఈ కుంభకోణాన్ని చేశారని అన్నారు. ఈ భారీ కుంభకోణంతో రేవంత్ రెడ్డి పదవీ కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి బావమరిది సూదిని సృజన్ రెడ్డి కంపెనీకి అర్హతలు లేకపోయినా వేల కోట్ల రూపాయల పనులను కట్టబెట్టారని విమర్శించారు. ఇండియన్ హ్యూమ్ పైప్ అనే కంపెనీని పిలిపించి బెదిరించి, ఆ కంపెనీ పేరుతో టెండర్లను కట్టబెట్టారని తెలిపారు.

పేరుకే ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ అయినా రేవంత్ రెడ్డి బావమరిది కోసం ఈ టెండర్లను కట్టబెట్టారని కేటీఆర్ అన్నారు. ఇందులో టెండర్ దక్కించుకున్న ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీతో రేవంత్ రెడ్డి బావమరిది జాయింట్ వెంచర్ పేరుతో డ్రామాకు తెరలేపారని తెలిపారు. 1,137 కోట్ల రూపాయల కాంట్రాక్టు గెలుచుకున్న తర్వాత ఆ కంపెనీ 20 శాతం పని చేస్తుందని, రేవంత్ రెడ్డి బావమరిది 80 శాతం వెయ్యి కోట్ల పని చేస్తుందని అంటున్నారని పేర్కొన్నారు. ఐహెచ్‌పీ అనే కంపెనీ ఈ మేరకు సెబీకి సమాచారం ఇచ్చిందని అన్నారు. ఈ కంపెనీని శిఖండి సంస్థగా అడ్డుపెట్టుకొని అనుముల రేవంత్ రెడ్డి, సూదిని సృజన్ రెడ్డి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్వయంగా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఈ కాంట్రాక్టులు కట్టబెట్టారని అన్నారు.

ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న పురపాలక శాఖ కేంద్రంగా ఈ భారీ అవినీతికి తెరలేపారని కేటీఆర్ అన్నారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ చట్టం, అవినీతి నిరోధక చట్టం 7, 11, 13 నిబంధనల మేరకు రేవంత్ రెడ్డి విచారణను ఎదుర్కోనాల్సి ఉంటుందని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి పదవి కోల్పోతారని అన్నారు. తన కుటుంబ సభ్యులకు లబ్ది చేకూరిస్తే, ఆశ్రితపక్షపాతం చూపిస్తే ఈ చట్టం ప్రకారం శిక్షార్హులేనని స్పష్టం చేశారు. ఇవే చట్టాల మిగితా 2వ పేజీలో

## కార్పొరేట్ హాస్పిటల్స్‌లో నిత్యం తనిఖీలు జరపాలి



- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రైవేటు, కార్పొరేట్ హాస్పి టల్స్‌లో నిత్యం తనిఖీలు జరపాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా సంబంధిత అధికారులను ఆదేశించారు. తనిఖీల వివరాలను ప్రతి నెలా తనకు నివేదిక రూపంలో అందించాలని సూచించారు. ఫుడ్ సెక్యూరిటీ అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్లలోని డైట్ క్యాంటీన్లను తనిఖీ చేయాలని మంత్రి ఆదేశించారు.

ఆరోగ్యశాఖలోని అన్ని విభాగాల హెచ్‌వోడీలు నెలకు కనీసం రెండుసార్లు జిల్లాల్లోని హాస్పిటల్స్‌ను విజిట్ చేయాలని మంత్రి సూచించారు. హాస్పిటల్ హెచ్ఆర్, అటెండెన్స్, ఎక్విప్‌మెంట్, మెడిసిన్, సానిటేషన్, డైట్ ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఈ మేరకు మంత్రి శనివారం సెక్రెటేరియట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వాణి, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖాన్లకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అన్ని హాస్పిటళ్లలో అవసరమైన మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.ట్రైబల్ ఏరియాల్లోని గర్భిణుల ఆరోగ్యంపై ఎక్కువగా ఫోకస్ చేయాలని ఆదేశించారు. ఈడీడీ (ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్) వివరాలతో ఓ క్యాలెండర్ మెయింటేయిన్ చేయాలని, ట్రైబల్ ఏరియాల్లో ఉన్న గర్భిణులను ఈడీడీ కంటే వారం రోజుల ముందే సమీపంలోని హాస్పిటల్‌కు తరలించి, వారికి బర్త్ వెయిటింగ్ రూమ్స్‌ను అలాట్ చేయాలని సూచించారు.

ఐటీడీఏల పరిధిలో ఉన్న హాస్పిటళ్ల అభివృద్ధిపై ఎక్కువగా ఫోకస్ చేయాలని మంత్రి ఆదేశించారు. ఆయా హాస్పిటళ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేసి తనకు ఇవ్వాలని అధికారులకు సూచించారు.డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్లు, హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు, టాస్క్‌ఫోర్స్ కమిటీలపై ప్రతి నెలా రివ్యూ చేస్తానని, అన్ని వివరాలతో రివ్యూకు అటెండ్ కావాలని అధికారులకు మంత్రి సూచించారు.అన్ని ప్రభుత్వ దవాఖాన్లలో బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.



## సీఎంకు హరీశ్‌రావు లేఖ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

వరద బాధితులకు సాయం అందించడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. "ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేసాయి. ఖమ్మం, భద్రాచలం, మహబూబాబాద్, సూర్యాపేట, వరంగల్ తో పాటు పలు జిల్లాల్లో వరద ఉధృతి బీభత్సాన్ని సృష్టించింది. కాలనీలు పూర్తిగా వరద నీటితో నిండిపోగా, జనజీవనం స్తంభించిపోయింది. ఎంతో మంది నిరాశ్రయులయ్యారు. సర్వస్వం మిగితా 2వ పేజీలో

## ఢిల్లీ సీఎంగా అతిశీ ప్రమాణ స్వీకారం



- ఐదుగురు మంత్రులు కూడా..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ఆప్ నేత అతిశీ ప్రమాణస్వీకారం చేశారు. శనివారం సాయంత్రం ఢిల్లీలోని రాజ్ నివాస్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా.. అతిశీ చేత ప్రమాణం చేయించారు. కాగా, అతిశీ ప్రస్తుతం ఆర్థిక, విద్య, పీడబ్ల్యూడీ, రెవెన్యూ సహా పలు కీలక శాఖలకు మంత్రిగా వ్యవహరిస్తున్నారు. అతిశీతో పాటు గోపాల్ రాయ్, కైలాశ్ గెహ్లాట్, సౌరభ్ భరద్వాజ్, ఇమ్రాన్ హుస్సేన్, ముకేశ్ అహ్లావత్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఇందులో ముకేశ్ అహ్లావత్ దళిత ఎమ్మెల్యే కాగా, తొలిసారి మంత్రిగా ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, అతిశీ తల్లిదండ్రులు, ఆప్ ఎమ్మెల్యేలు, పలువురు మంత్రులు పాల్గొన్నారు.

# పీఏసీ మొదటి సమావేశం రసాభాస

- చైర్మన్ పదవిపై మళ్లీ అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం
- పీఏసీ సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**
: అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ మొదటి సమావేశం రసాభాసగా మారింది. చైర్మన్ అరికెపూడి గాంధీ ఆధ్యక్షతన జరిగిన సమావేశానికి 13 మంది సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబులు హాజరయ్యారు. మొదటి సమావేశం కావడంతో పీఏసీ విధివిధానాలపైనే చర్చించారు.

అయితే సమావేశం ప్రారంభంలోనే పీఏసీ చైర్మన్? ఎన్నిక అప్రజాస్వామికమని అది చెల్లదంటూ బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు. హరీశ్‌రావు పేరు లేకుండా చేశారని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. పీఏసీ చైర్మన్‌ను ప్రతిపక్ష నేత సూచించిన వ్యక్తికి ఇవ్వడం సభాసంప్రదాయమని దానికి కాంగ్రెస్ తూట్లు పొడిచిందని మండిపడ్డారు. ఎలక్షన్ కాకుండా సెలక్షన్ చేశారంటూ ప్రశాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.గాంధీ నియామకంపై మంత్రి శ్రీధర్ బాబును బీఆర్ఎస్ సభ్యులు నిలదీశారు.



బీఆర్ఎస్ పీఏసీ సభ్యుల ఆరోపణలపై కాంగ్రెస్ సభ్యులు స్పందించారు. పీఏసీ ఎన్నిక అసెంబ్లీ నియమావళి ప్రకారమే జరిగిందని ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వంశీకృష్ణలు పేర్కొన్నారు. పీఏసీ సమావేశం ప్రారంభం కాగానే హిడెన్ ఎజెండాతో స్పీకర్‌పై దురుసుగా ప్రవర్తించారని ధ్వజమెత్తారు. 2018లో కాంగ్రెస్‌కు దక్కాల్సిన పీఏసీ పదవిని సభా సాంప్రదాయాలకు విరుద్ధంగా ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్ ఓవైసీకి ఇచ్చారని ఆరోపించారు.

# రూ. 8,888 కోట్ల అవినీతి




**(మొదటి పేజీ తరువాయి)**
కింద సోనియా గాంధీ తన పదవిని కోల్పోయిందని గుర్తుచేశారు. 2006లో సోనియా గాంధీ నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా పదవిలో ఉన్నందుకు ఈ చట్టం ప్రకారం తన పదవిని కోల్పోయిందని తెలిపారు. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప కూడా అక్రమ మైనింగ్ అనుమతులు తన కుటుంబ సభ్యులకు ఇచ్చినందుకు తన పదవి కోల్పోయారని గుర్తుచేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి 2011లో అశోక్ చవన్ ఆదర్శ కుంభకోణంలో తన పదవి కోల్పోయారని అన్నారు.

బావమరిది కళ్లల్లో సంతోషం కోసం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. తన ఇంట్లో లంకె బిందెలు నింపుకోవడం కోసం అక్రమ టెండర్లకు ముఖ్యమంత్రి తెరలేపారని తెలిపారు. రేవంత్ రెడ్డి అమృత్ టెండర్లలో పిలిచిన 8,888 కోట్ల రూపాయల టెండర్ల వివరాలను ప్రభుత్వం బయట పెట్టడం లేదని అన్నారు. ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇవ్వాల్సిన గత్యంతరం వలన ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి దక్కిన వందల కోట్ల రూపాయల టెండర్ బయటకు వచ్చిందని తెలిపారు. వీటికి సంబంధించిన ఒక్క జీవో కూడా ప్రభుత్వం వెబ్‌సైట్‌లో పెట్టడం లేదని అన్నారు. టెండర్ల తాలూకు పూర్తి సమాచారాన్ని ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

రేవంత్ రెడ్డి చేస్తున్న అనేక కుంభకోణాలకు సంబంధించిన వివరాలను ప్రజల ముందు వరుసగా ఉంచుతామని కేటీఆర్ తెలిపారు.కొడంగల్ ఎత్తిపోతల పథకం, ఫోర్ బ్రదర్స్ సిటీ వంటి కుంభకోణాలను ప్రజల ముందు ఉంచుతామని అన్నారు. బావమరిదికి అమృతం పంచుతూ తెలంగాణ ప్రజలకు విషాన్ని పంచుతున్న రేవంత్ రెడ్డిని ప్రజల ముందు ఎండగడతామని స్పష్టం చేశారు. సృజన్ రెడ్డి కంపెనీకి ఉన్న లాభం కేవలం రెండు కోట్లే కానీ.. వెయ్యికోట్ల పనులు చేస్తుందని అంటున్నారని తెలిపారు. పబ్లిక్ లిస్టెడ్ కంపెనీ అయిన ఐ.హెచ్.పీ కంపెనీ కేవలం 200 కోట్ల పనులు చేస్తుందంటున్నారని అన్నారు.

బావమరిది కంపెనీకి 1,100 కోట్ల పనులు ఇచ్చి జీవోలను వెబ్‌సైట్‌లో ఎందుకు పెట్టడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు కోట్ల కంపెనీకి వెయ్యి కోట్ల టెండర్ అప్పజెప్పి ఈ విషయాన్ని ఎందుకు రేవంత్ రెడ్డి దాస్తున్నారో చెప్పాలన్నారు. ఇందులో ముఖ్యమంత్రి ఒత్తిడి మేరకే ఈ టెండర్ల గోల్‌మాల్ జరిగిందని విమర్శించారు. ఈ రాష్ట్రంలో బయటకు సమాచారం రాని అక్రమాలు ఎన్నో ఉన్నాయని ఆరోపించారు. అమృత్ పథకం అనేది కేంద్ర ప్రభుత్వ పథకమని.. అందుకే ఈ టెండర్లలో జరిగిన అభివృద్ధి అక్రమాలపై నిన్న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రులకు లేఖ రాశామని తెలిపారు. ఈ టెండర్లలో జరిగిన అక్రమాలను తేల్చాలని కోరామని అన్నారు.

రాష్ట్రంలో బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు ఉన్న కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకంలో జరిగిన అవినీతిపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌తో బీజేపీ కుమ్మక్కు కాకపోతే పూర్తిస్థాయి ఎంక్వైరీకి కేంద్రం ఆదేశించాలని డిమాండ్ చేశారు. అమృత్ టెండర్లను వెంటనే రద్దు చేయాలని అన్నారు. ఈ విషయంలో బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే కేంద్రం పరిధిలోని ఈ పథకంలో జరుగుతున్న అవినీతిపై వెంటనే విచారణకు ఆదేశించాలన్నారు. లేదంటే రేవంత్ రెడ్డికి, కేంద్రంలోని బీజేపీ నేతలకు అవినీతితో సంబంధం ఉందని అనుకోవాల్సి వస్తుందని చెప్పారు. ఈ విషయంలో స్పందించకపోతే మీ కుమ్మక్కు రాజకీయాలు అర్థమవుతాయని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ తనకు నచ్చిన విచారణ సంస్థతో ఈ అంశంలో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్యలో ప్రేమకథ నడుస్తుందని.. అందుకే బీజేపీ ఎంపీ రఘునందన్ రావు, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌లు ముఖ్యమంత్రి శుద్ధపూస అంటూ మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

## సీఎంకు హరీశ్‌రావు లేఖ

**(మొదటి పేజీ తరువాయి)**
కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. అధికారిక లెక్కల ప్రకారమే, 33 మంది ప్రాణాలు కోల్పోయారు. 5,438 వేల కోట్ల ఆస్తి నష్టం, 4.25 లక్షల ఎకరాల్లో పంట నష్టం సంభవించింది. ఇంకా లెక్కకు రాని మరణాలు ఆస్తి నష్టం, పంట నష్టం చాలా ఉంటుంది. ఇది అత్యంత బాధాకరం. ఇది అందరి మనస్సులను కలిచివేసిన విషాదం. వరదలు వచ్చిన ప్రాంతాల్లో ఇప్పటికీ ఇంకా బురద నిండిన ఇళ్లు, ఇసుక మేటలు వేసిన పొలాలు, కొట్టుకుపోయిన రోడ్లు కనిపిస్తున్నాయి. ప్రాణాలు కోల్పోయిన విషాదాలు, బాధితుల విలాపాలే కనిపిస్తున్నాయి. ఎవరిని పలుకరించినా హృదయాన్ని కదిలించే కన్నీటి గాథలే వినిపిస్తున్నాయి. కడగండ్ల పాలైన తమకు ప్రభుత్వం వైపు నుంచి కనీస ఓదార్పు కూడా కరువైందని, ఆపద తమను సమయంలో ఆదుకోలేదనే ఆగ్రహం వరద బాధితుల్లో పెల్లుబుకుతున్నది.

ఇటువంటి విపత్కర పరిస్థితిలో అధికారంలో ఉన్న మీరు మరింత బాధ్యతగా వ్యవహరించాలి. పాలకులు అండగా ఉన్నారనే ధీమాను ప్రజలకు కల్పించాలి. కానీ, ఈ విషయంలో మీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైపోయిందని చెప్పడానికి చింతిస్తున్నాను. వాతావరణ శాఖ ముందే హెచ్చరించినప్పటికీ విపత్తును ఎదుర్కొనే సన్నాహక చర్యలు తీసుకోవడంలో, ప్రజలను అప్రమత్తం చేయడంలో వైఫల్యం, ముంపు ప్రదేశాలను గుర్తించి ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో వైఫల్యం, వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడంలో వైఫల్యం, బాధితులను గుర్తించడంలో వైఫల్యం, ఓదార్చడంలో వైఫల్యం, సాయం అందించడంలో వైఫల్యం. మొత్తంగా విపత్తు నిర్వహణ, నష్టనివారణ చర్యలు తీసుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. ఇన్ని రోజుల తర్వాత కూడా వరద మిగిల్చిన బురదను తొలగించే ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నదంటే మీ వైఫల్యాన్ని అంచనా వేయొచ్చు. అధికార పార్టీ నుంచి 9 మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మంలో వరదల్లో చిక్కుకున్న 9 మందిని కాపాడే నాయకుడే కరువయ్యాడు. చివరికి ఒక హెలికాప్టర్ కూడా దిక్కు లేని దీన రాష్ట్రంగా తెలంగాణను మార్చారు. వరదలో చిక్కుకున్న వారిని కాపాడటంలో ఒక జేసీబీ డ్రైవర్ చేయగలిగిన పనిని యావత్ ప్రభుత్వ యంత్రాంగం చేయలేకపోయిందంటే ఇంతకు మించిన చేతకాని తనం ఉంటుందా? వరద తాకిడికి గురైన ప్రాంతాలను, కాలనీలను సంపూర్ణంగా పర్యటించడానికి మీకు ఓపిక లేక పోయింది. విషాద పర్యటనలో సైతం చిరునవ్వులు చిందిస్తూ చేతులూపుతూ ప్రచార పర్యటన చేసిన విధానం చూసి ప్రజలు విస్తుపోయారని మీకు తెలియచేయడానికి చింతిస్తున్నాను. వరద బాధితులకు సహాయం చేయడంలో మీ ప్రభుత్వం అన్ని దశల్లో విఫలమైంది. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. ఇది కోతల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని ఈ సందర్భంగా తేలిపోయింది. అందుకే బాధితుల్లో ఎవరిని పలకరించినా మీ ప్రభుత్వంపై ఆక్రోశం, ఆగ్రహమే కనిపిస్తున్నాయి.

తూతూ మంత్రంగా ప్రభుత్వ సాయం

విపత్తు వేళ మీ నిర్లక్ష్యానికి తోడుగా, నష్టపరిహారం విషయంలో మీ అసమంజస వైఖరి ప్రజలను మరింత ఆగ్రహానికి, ఆవేదనకు గురి చేస్తున్నది. ముఖ్యమంత్రి గారు తక్షణ సాయం కింద ముందు పదివేల రూపాయల నష్టపరిహారం ఇస్తామన్నారు. ఆ తర్వాత నష్ట స్థాయిని బట్టి తగిన సాయం చేస్తామని చెప్పారు. మంత్రి పొంగులేటి గారు బాధిత కుటుంబాలకు ఇచ్చే సాయాన్ని మరో రూ. 6,500 కలిపి మొత్తం 16,500లకు పరిమితం చేశారు. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు కొట్టుకుపోయి, చెడిపోయి కట్టుబట్టలతో మిగిలిన వారికి 16,500 సహాయం ఏ మూలకు వస్తాయి. ఇండ్లు కూలిన పేద వారికి 18వేల సహాయం చేస్తే ఎలా సరిపోతాయి? ఒక్క ఖమ్మం జిల్లాలోనే 15,096 మంది వరద బాధితులకు 16,500 సహాయం అందించేటందుకు గుర్తిస్తే, రూ. 18వేల సహాయం అందించేటందుకు కేవలం 146 మంది మాత్రమే గుర్తించడంలో మీ ఆంతర్యం ఏమిటి? రుణమాఫీలో లబ్ధిదారులను కుదించినట్లుగానే, వరద బాధితుల సంఖ్యను కూడా కుదించేందుకు మీరు ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటు. ఇంతకన్నా దౌర్భాగ్యం ఇంకోటి ఉండదు. చిన్న చిన్న వ్యాపారస్తులు నిల్వ చేసుకున్న సరుకులు కూడా వరద పాలై పోయి పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయి, జీవితమే అగమ్యగోచరమైన స్థితిని ఎదుర్కొంటున్నారు. వారికి మీరిచ్చే కొద్ది పాటి సాయంతో ఉపశమనం కలగదు" అని పేర్కొన్నారు.

## బస్సులో ప్రయాణికుడికి గుండెపోటు..

**(మొదటి పేజీ తరువాయి)**
స్పృహలోకి వచ్చాడు. ప్రయాణికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది మురళికృష్ణను అంబులెన్స్‌లో సూరారంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

# అమృత్ టెండర్లలో అవినీతి జరగలేదు.



- నిరూపించకపోతే కేటీఆర్ రాజీనామా చేస్తారా
- కేటీఆర్ పై పరువు నష్టం దావా వేస్తాం.
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. అమృత్ టెండర్లలో ఎటువంటి అవినీతి జరగలేదన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..'అమృత్ టెండర్లలో అవినీతి జరగలేదు. రూ. వేల కోట్ల కుంభకోణం జరిగిందంటూ కేటీఆర్ అనవసర ఆరోపణలు చేస్తున్నారు. కేటీఆర్ పై పరువు నష్టం దావా వేస్తాం.బీఎల్ఆర్, మెగా, గజా కంపెనీలకు ఆనాటి ప్రభుత్వం రూ. 3,516 కోట్ల అంచనా టెండర్లు 3.99 శాతం ఎక్కువకు 2022-23లో ఒప్పందం చేసుకుంది. ఆ మూడు టెండర్లు ఎక్సెస్ ఉన్నాయని మేం గుర్తించాం. నిబంధనలకు తగినట్టుగా రీకాల్ చేయాలని సీఎం ఆదేశించారు' అంటూ మంత్రి పొంగులేటి అన్నారు.

కేటీఆర్ కు నేను ఓపెన్ ఛాలెంజ్ విసురుతున్నా.. మేం పిలిచిన టెండర్ల విలువ రూ. 8,888 కోట్లు కాదు. ఒకవేళ రూ. 8,888 కోట్లయితే, నేను రాజీనామా చేస్తా. ఆ టెండర్లు రూ. 3516 కోట్లు మాత్రమే అయితే.. నువ్వు రాజీనామా చేస్తావా కేటీఆర్? మీ ఎమ్మెల్యేలంతా కాదు.. మీరు ఎమ్మెల్యేగా రాజీనామా చేస్తారా? శోధ కంపెనీకి చెందిన సుజన్ రెడ్డి, నాపై పోటీ చేసిన ఉపేందర్ రెడ్డి అల్లుడు. బీఆర్ఎస్ హయాంలో సుజన్ రెడ్డికి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో పనులిచ్చారు. ట్యాక్సులతో కలుపుకుని టెండర్ల విలువ రూ. 8,888 కోట్లున్నా నేను రాజీనామా చేస్తా. లేదంటే.. కేటీఆర్ రాజీనామా చేయాలి. ట్విట్టర్ లో షో చేస్తే కాదు కేటీఆర్.. విమర్శ చేయడానికి ముందు కనీస ఆధారాలు చూపండి. నా ఛాలెంజ్ ను స్వీకరిస్తే రేపు ఉదయం ఏ సమయానికి రావాలో వస్తా. మీరు చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపండి. మీరు చెప్పింది నిజమైతే కరెక్ట్ ఫార్మాట్ లో నేను రాజీనామా చేస్తా. మీరు చెప్పింది తప్పయితే.. స్పీకర్ ఫార్మాట్ లో రాజీనామా చేయాలి.

ఒక్క రూపాయి కూడా అంచనాలు పెంచకుండా పాత రేట్లకే టెండర్ పిలిచాం. కొత్తగా టెండర్ దక్కించుకున్న ఓ కంపెనీ సుజన్ రెడ్డిదే.. కాకపోతే, ఆయన నా మీద పోటీ చేసిన ఉపేందర్ రెడ్డికి స్వయనా అల్లుడు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాలమూరు రంగారెడ్డిలో ప్యాకేజీ -7లో రూ. 2300 కోట్ల విలువైన టన్నెల్ వర్క్ లో రూ. 1100 కోట్లు విలువ చేసే వర్క్ ను ఆయన కంపెనీకి కట్టబెట్టారు. ప్రస్తుత మూడు టెండర్ల విలువ రూ. 3687 కోట్లు మాత్రమే. గత ప్రభుత్వం పిలిచిన టెంజర్ల కంటే తక్కువకే మా హయాంలో కన్ఫామ్ అయ్యాయి. విమర్శ చేయొచ్చు.. కానీ, అందులో పస ఉండాలి' అంటూ కేటీఆర్ కు పొంగులేటి సవాల్ విసిరారు. చూడాలి మరి.. మంత్రి సవాల్ పై కేటీఆర్ స్పందిస్తారా లేదా అనేది.

## టీపీసీసీ చీఫ్ మహేష్ జిల్లా స్థాయి సమావేశాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**
టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ డీసీసీలతో మహేష్ వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు రాకపోతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్లు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. కొత్త, పాత నేతలు సామరస్యంగా పని చేయాలని సూచించారు. పదవులు పొందిన వారు ఓ మెట్టు దిగివచ్చి ప్రవర్తించాలని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నదే తన ప్రయత్నమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ముందుకు తీసుకెళ్లడంపై టీపీసీసీ చీఫ్ పార్టీ కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు.




# రాష్ట్రంలో 3 రోజులు భారీ వర్షాలు..

- అన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**
రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. బంగాళాఖాతంలో అల్పపీనడం ఏర్పడే అవకాశం ఉందని, దాని ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు పడే సూచనలు ఉన్నాయని హెచ్చరించింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు హైదరాబాద్ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

ఆదిలాబాద్, జనగాం, భూపాలపల్లి, ఖమ్మంతో పాటు మహబూబాబాద్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట, వరంగల్, హనుమకొండలో ఓ మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది. ఈ మేరకు వాతావరణ శాఖ ఆయా జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది.భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి జిల్లాల్లో కొన్నిచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. నల్గొండ, సూర్యాపేట, జనగామ, యాదాద్రి జిల్లాలతో పాటు భువనగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. ఆదివారం, సోమవారం కూడా పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశాలు ఉందని వాతావరణశాఖ ప్రకటించింది.

**హైదరాబాద్‌లో అతి భారీ వర్షాలు**

రాబోయే రెండు రోజులు సైతం హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. రానున్న రెండు రోజులు ప్రజలు అలర్ట్‌గా ఉండాలని సూచించింది. హైదరాబాద్, నగరం పరిసర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. హైదరాబాద్ సహా పరిసర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు అలర్ట్ అయ్యారు. ఎస్‌డీఆర్ఎఫ్, మున్సిపల్ అధికారులను సిద్ధం చేశారు. వర్షం కారణంగా నీరు రోడ్లపై నిలవకుండా ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టాలని క్షేత్ర స్థాయి సిబ్బందిని ఉన్నతాధికారులు ఆదేశించారు. మరోవైపు ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు.

# హైదరాబాద్‌లో కుండపోత వర్షం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**
హైదరాబాద్‌లో శనివారం కుండపోత వర్షం కురిసింది.దీంతో లోతట్టు ప్రాంతాలు జలయమయి రోడ్లు చెరువులుగా తలపించున్నాయి. కొండాపూర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బేగంపేట, పంజాగుట్ట సికింద్రాబాద్, ఉప్పల్,బోడుప్పల్, నాగోల్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, బషీర్ బాగ్, అబిడ్స్, నాంపల్లి, కోఠి, నారాయణగూడ, ముషీరాబాద్, సికింద్రాబాద్, హిమాయత్ నగర్, చిక్కడపల్లి, ఎల్బీనగర్, లక్డీకపూల్, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్ పేట్ , ఎస్ఆర్ నగర్, కొండాపూర్, మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్, బోయిన్ పల్లి, సుచిత్ర, అల్వాల్, ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అలర్ట్ గా ఉండాలని జీహెచ్ఎంసీ హెచ్చరిక జారీ చేసింది. ప్రజలు ఎవరు కూడా బయటకు రావద్దంటూ హెచ్చరించింది జీహెచ్ఎంసీ.

# 28న రాష్ట్రానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**(మొదటి పేజీ తరువాయి)**
రాష్ట్రపతి కార్యాలయ అవసరాలకు అనుగుణంగా సహాయక సిబ్బందితో పాటు మహిళా వైద్యుల సేవలను అందుబాటులో ఉంచాలని, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను కోరారు.

రాష్ట్రపతి కాన్వాయ్ ఉపయోగించాల్సిన రోడ్ల మరమ్మతులను కంటోన్మెంట్ బోర్డు, జీహెచ్ఎంసీ అధికారులతో సమన్వయంతో చేపట్టాలని

ఆర్అండ్‌బి శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి నిలయంలో పాములు పట్టేవారిని అందుబాటులో ఉంచాలని, అలాగే రాష్ట్రపతి నిలయం పరిసర ప్రాంతాల్లో కోతుల బెడద, తేనెటీగలు వంటి వాటి నివారణకు ప్రత్యేక బృందాలను జీహెచ్ఎంసీ సమన్వయంతో ఏర్పాటు చేయాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి సందర్శనకు వెళ్లే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు. డీజీపీ జితేందర్, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, డీజీ ఫైర్ సర్వీసెస్ నాగిరెడ్డి, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పొలిటికల్ కార్యదర్శి రఘునందన్ రావు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సమాచార పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్ హనుమంత రావు, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలి, సీఎండీ టీఎస్‌పీడీసీఎల్ ముషారఫ్, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# దక్షిణ డిస్కంలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం..



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**
దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో రికార్డు స్థాయిలో అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదయ్యింది. శుక్రవారం 10:35 గంటలకు 9910 మెగా వాట్ల విద్యుత్ డిమాండ్ నమోదయ్యింది. ఈ సీజన్‌లో భారీగా వర్షాలు పడటం, నీటి లభ్యత పెరగడం, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండటంతో వ్యవసాయ రంగంలో డిమాండ్ భారీగా పెరుగుతున్నది.

తాజా సీజన్ లో అత్యధిక డిమాండ్ 10000 మెగావాట్లను కూడా దాటే అవకాశం ఉన్నదని, డిమాండ్ ఎంతగా పెరిగినా దానికి తగ్గట్టు విద్యుత్ సరఫరా అందిస్తామని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖి తెలిపారు. గతేడాది సెప్టెంబర్ 20న ఉదయం 10:00 గంటలకు 9862 మెగా వాట్లు అత్యధిక డిమాండ్ నమోదయ్యింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి డిమాండ్ భారీగా పెరగడంతో ఈ వారంలో సరాసరి విద్యుత్ డిమాండ్ 9317 మెగావాట్లు ఉండగా గతేడాది 9138 మెగా వాట్లు, సరాసరి వినియోగం 190.29 మిలియన్ యూనిట్లు కాగా, గతేడాది 182.11 మిలియన్ యూనిట్లుగా నమోదయ్యింది.

# తిరుమలకు పాల ఉత్పత్తులు అందించడానికి
## తెలంగాణ విజయ డైరీ సిద్ధం

- రాష్ట్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ముఖ్యకార్యదర్శి సబ్యసాచి ఘోష్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**
తెలంగాణ పశుసంవర్ధక శాఖకు చెందిన విజయ డైరీ సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం వారికి సమర్పించే నైవేద్యాల కోసం స్వచ్ఛమైన, నాణ్యమైన ఉత్పత్తులను సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పశు సంవర్ధక శాఖ ముఖ్యకార్యదర్శి సబ్యసాచి ఘోష్ తెలిపారు. ఈ మేరకు ఆయన టీటీడీ కార్యనిర్వహణ అధికారి జె.శ్యామలరావుకు శనివారం లేఖ ద్వారా ప్రభుత్వ ప్రతిపాదనను తెలియజేశారు.

దేశ వ్యాప్తంగా పాలు, పాల ఉత్పత్తుల రంగంలో తెలంగాణ విజయ డైరీ సంస్థ ప్రసిద్ధి చెందినదని, వినియోగదారులకు విలువైన, నాణ్యమైన ఉత్పత్తులను సరఫరా చేసిన చరిత్రను కలిగి ఉందని ఆ లేఖలో పేర్కొన్నారు. విజయ డైరీ ఉత్పత్తులలో నాణ్యతను నిర్ధారించడంతో పాటు, లక్షలాది మంది పాల రైతుల జీవనోపాధికి సంస్థ తోడ్పడుతుందని ఆయన తెలిపారు.

తిరుమల తిరుపతి దేవస్థానానికి అధిక నాణ్యత గల నెయ్యి, ఇతర పాల ఉత్పత్తుల అవసరాలన్నింటినీ తీర్చడానికి విజయ డైరీ సంస్థ సన్నద్ధతను తెలియజేశారు. విజయ డైరీ ప్రభుత్వ సంస్థ అయినందున సరఫరాల స్వచ్ఛత, నాణ్యత, ధరల విషయంలో పూర్తి పారదర్శకంగా ఉంటుందని ఆయన తెలిపారు. దేవస్థానానికి, భక్తులకు సేవ చేసే అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ పశు సంవర్ధక శాఖ ముఖ్యకార్యదర్శి సబ్యసాచి ఘోష్ టీటీడీ కార్యనిర్వహణ అధికారి జె.శ్యామలరావు కు రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు.

## ప్రేమ జంట ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**
పెద్దలు తమ ప్రేమను అంగీకరించలేదని మనస్తాపం చెంది ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా, దోమకొండ మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం .. కోనాపూర్ గ్రామానికి చెందిన మోగిలి సాయికుమార్ తమ వ్యవసాయ బావి వద్ద శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అదేవిధంగా ఇదే మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన రంగోలు వీణ అనే యువతి తమ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతులిద్దరూ గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారని, వారి ప్రేమకు పెద్దలు అగీకరించరని భావించి ఆత్మహత్యకు పాల్పడినట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు. ఇద్దరు మృతుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# చదువుతో పాటు ఆటల్లో రాణించాలి..



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- వీర్నపల్లిలోని పలు పాఠశాలలను సందర్శించిన కలెక్టర్

**బలగం టీవీ , సిరిసిల్ల :**

విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.శనివారం వీర్నపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని తరగతి గదులు, వంట గది, సామాగ్రి, స్కూల్ ఆవరణ పరిశీలించారు. అలాగే మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో భోజనం గది, కిచెన్, ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ఈ రోజు మెనూలో ఏ ఆహార పదార్థాలు పెట్టారో అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ బిల్డింగ్ పైకి ఎక్కి చూశారు. బిల్డింగ్ పైకి ఎక్కి ద్వారానికి తాళం వేయాలని, అవసరం ఉన్న చోట గ్రిల్స్ పెట్టించాలని, విద్యాలయం ఆవరణ, వీధిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

వీర్నపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్జీఎఫ్ మండల స్థాయి వాలీబాల్ పోటీలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రారంభించి, వారితో సరదా గా కాసేపు వాలి బాల్ ఆడి విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమం లో డీఈవో రమేష్ కుమార్, జిసిడిఓ పద్మజ, తహసిల్దార్ మారుతి రెడ్డి ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నేరెళ్ల నర్సింగం గౌడ్

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

సిరిసిల్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్ నియామకం సందర్భంగా వారికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఉపసర్పంచ్ పెద్దూరి తిరుపతి, మాజీ వార్డ్ సభ్యులు రెడ్డి పరశురాములు, సుద్దాల కర్ణాకర్, గంగరాజి రెడ్డి, దొందడి రాజు, సందిరి వెంకటరెడ్డి, గుంటి అంజయ్య, శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా ఎంపిక చేసినందుకు రైతుల పక్షాన నిలబడి వారి కష్టసుఖాలలో ఉంటానని తెలిపారు.




# వరి ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి



- ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలి
- గ్రేడ్ ఏ రకానికి రూ.2320,కామన్ రకానికి రూ.2300..
- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**బలగం టీవీ , సిరిసిల్ల**

వరి ధాన్యం కొనుగోళ్ళు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. శనివారం ఖరీఫ్ సీజన్(2024-25) ధాన్యం కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో సకల వసతులు కల్పించాలని, తాగు నీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్ల చేయాలని అన్నారు . రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. అవసరమైన గన్ని బ్యాగులు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2320, కామన్ రకానికి రూ.2300 నిర్ణయించిదని అన్నారు .

**ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రారంభం..**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు అన్నారు.వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లా లో ఈ సీజన్లో దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని అన్నారు . ధాన్యాన్ని సేకరించేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202, ఐకేపీ ఆధ్వర్యంలో 44, వివిధ శాఖల ఆధ్వర్యంలో 12 కేంద్రాలు, మొత్తం 258 ప్రారంభించనున్నట్లు తెలిపారు. అవసరం అయితే ఇంకా కేంద్రాలు ఎక్కువ ప్రారంభిస్తామని పేర్కొన్నారు,

**అందుబాటులో పరికరాలు..**

జిల్లాలో అవసరం మేరకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు . టార్పాలిన్లు 7777, తూకం వేసే యంత్రాలు 766, ప్యాడీ క్లీనర్లు 634, తేమ శాతం చూసే మెషిన్లు 603 అందుబాటులో ఉన్నాయని, జిల్లాలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.సమీక్షలో డీసీఎస్ఓ వసంత లక్ష్మి, జిల్లా మేనేజర్ రజిత డీఏఓ అఫ్జల్ బేగం, డీసీఓ రామకృష్ణ, డీఎంఓ ప్రకాష్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, డీటీఓ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యం అంటే
# విద్యార్థుల బతుకులు ఆగం చేయడమేనా




- ప్రభుత్వ విప్ వెంటనే స్పందించాలి...
- ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్
- సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం...

**బలగం టీవీ , సిరిసిల్ల :**

ఇందిరమ్మ రాజ్యం అంటే విద్యార్థుల బతుకులు ఆగం చేయడమేనా, ఒకటే రోజు జిల్లాలో నాలుగు సంఘటనలు జరిగితే జిల్లాకు దిక్కు దివాణా లేని పరిస్థితి రాజన్న సిరిసిల్లకు నెలకొందని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ అన్నారు.శనివారం సిరిసిల్ల పట్టణం లో ప్రభుత్వ హాస్టల్లో నెలకొన్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్త లేదని నిరసిస్తూ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను ఏబీవీపీ నాయకులు దగ్ధం చేశారు.

ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పట్టింపు లేని విధానాల ద్వారా ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జిల్లా లోని పలు గురుకులలో అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ఆ విషయాలు భయంతో బయటకు చెప్పుకోలేక పోతుతున్నారు అని అన్నారు.

గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతిక శాస్త్రం, ఇంగ్లీష్ అధ్యాపకులు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, కొంతకాలంగా ఫోన్లలో అసభ్యకరమైన సందేశాలు పంపిస్తూ వారిని వేధిస్తున్నారు అని అన్నారు. ఇల్లంతకుంట గాలిపెల్లి బీసీ వెల్ఫేర్ హాస్టల్ లో రోహిత్ విద్యార్థి పాము కాటు కు గురైయ్యాడన్నారు. వీర్నపల్లి మండల కేంద్రములో కేజీబీవీ లో విద్యార్థులను టార్చర్ పెడుతుండడం తో విద్యార్థిని బిల్డింగ్ పైన దుంకడం జరిగింది అని అన్నారు.తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గురుకులంలో 5 రోజుల క్రితం ఎలుకలు కుట్టడం తో 20 మంది విద్యార్థులకు గాయాలయ్యాయని,ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాలో దాదాపు అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో ఏదో ఒక సమస్యలు, ఇబ్బందులతో విద్యార్థులు బాధ పడుతున్నారు అని అన్నారు.అక్కపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బిల్లులు రాలేదని మధ్యాహ్న భోజనం పెడుతలేరని,మధ్యాహ్న భోజనం లేక పిల్లలు ఆకలికి ఏడిస్తే గానీ ఇంటికి పంపని పరిస్థితి నెలకొందని అన్నారు.నెల రోజుల్లోనే ఇన్ని ఘటనలు జరుగుతున్న జిల్లా ఇన్చార్జి, ప్రభుత్వ విప్ కనీసం నోరు మెదుపుతలేరని అన్నారు.

విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న ఉపాధ్యాయులు, అధికారుల పైన వెంటనే చర్యలు తీసుకోవాలి అని,విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, వేధిస్తున్న ఉపాధ్యాయుల పైన వెంటనే చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ హాస్టళ్లలో పాము కాటుకు గురైన విద్యార్థి, ఫుడ్ పాయిజన్ తో అస్వస్థతకు గురైన విద్యార్థులు, ఎలుకల వల్ల అస్వస్థతకు గురైన విద్యార్థులకు, వేధింపులతో బిల్డింగ్ పై నుండి దూకిన విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించి, వీటి పైన విచారణ జరిపి మళ్ళీ పునరావృతం అవ్వకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజు రావు, విభాగ్ లా ఫోరమ్ కన్వీనర్ సమానపల్లి ప్రశాంత్, టౌన్ సెక్రటరీ ఎల్లగందుల శ్రీనివాస్,రుద్రవేణి ధనుష్, శివ,మధు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు



- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్:

**బలగం టీవీ ,సిరిసిల్ల:**

అన్ని శాఖల సమన్వయం తో జిల్లాలో గంజాయి నిర్మూలనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని శనివారం ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కలెక్టర్ ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని అన్నారు.మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని, వీటికి అలవాటు పడితే ఆర్థికంగా, ఆరోగ్య పరంగా, అనేక ఇబ్బందులు తప్పవని అని అన్నారు.

డ్రగ్స్ వినియోగం దుష్ప్రభావాల గురించి యువతకు పరిజ్ఞానం కల్పించేందుకు మీడియా, సోషల్ మీడియాతోపాటు డిగ్రీ, జూనియర్ కళాశాలలు, పాఠశాల లలో అవగాహన కార్యక్రమాలు సమర్థవంతంగా చేపట్టాలని,డ్రగ్స్ నిర్మూలన కోసం లైన్ డిపార్ట్మెంట్స్ ఒకటిగా కలిసి పని చేయాలని అన్నారు. ప్రతి స్కూల్ ,కాలేజీలలో మత్తు పదార్థాల నిర్మూలనకు కమిటీలను కొనసాగిస్తూ, విద్యార్థులు కు అన్ని రకాల మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించేందుకు వ్యాసరచన, డిబేట్, పోటీలు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి, డీఏఓ అఫ్జల్ బేగం, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, అధికారులు పాల్గొన్నారు.

# భారీగా డ్రగ్స్ పట్టివేత



**బలగం టీవీ , హైదరాబాద్**

రెండు వేర్వేరు కేసుల్లో హాష్ ఆయిల్, గంజాయి చాక్లెట్లను రాచకొండ ఎస్ఓటి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మీర్‌పేట పరిధిలో నలుగురు సభ్యుల ముఠాను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2.5 లీటర్ల హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. ఆదిభట్ల పరిధిలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న నిందితుడిని అరెస్టు చేశారు. అతడి నుంచి 3.8 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఎల్‌బి నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

హైదరాబాద్ సైదాబాద్ టెలికాం క్వార్టర్స్‌లో నివాసముంటున్న వి.రంజిత్‌కుమార్, మీర్‌పేట్ తిరుమళా ఎన్‌క్లేవ్‌కు చెందిన బి.సాయి నితిన్, బి.నరేంద్రా, ఎల్‌బీనగర్‌కు చెందిన బి.సాయి కృష్ణా ఒక ముఠాగా ఏర్పడ్డారు.విశాఖపట్నంకు వెళ్లిన ఈ ముఠా స్థానికంగా గంజాయి, హాష్ ఆయిల్, డ్రగ్స్ దందా నిర్వహించే సాయిని కలుసుకున్నారు. సాయి నుంచి హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి తిరిగి హైదరాబాద్‌కు వస్తున్న క్రమంలో కొద్ది రోజుల క్రితం సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. 9 రోజుల అనంతరం రిమాండ్ నుంచి బయటకు వచ్చిన తర్వాత తిరిగి హాష్ ఆయిల్‌ను సరఫరా చేయాలని అన్నవరం వెళ్లారు. అక్కడ సాయి వద్ద 5గ్రాములకు రూ.2వేల చొప్పున 2700 గ్రాముల హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేశారు. గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్ తీసుకొచ్చి మీర్‌పేట్‌లోని సాయి నితిన్ ఇంట్లో దాచిపెట్టారు. చిన్నచిన్న బాటిళ్లలో హాష్ ఆయిల్‌ను నింపి సరఫరా చేసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు, మీర్ పేట్ పోలీసులతో కలిసి ఈ నెల 21న ఉదయం నిందితులను అరెస్టు చేశారు. ఒక కిలో హాష్ ఆయిల్ తయారు చేయాలంటే 35 నుంచి 40 కేజీల గంజాయిని నిందితులు ఉపయోగిస్తారని సీపీ తెలిపారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు సాయికోసం గాలిస్తున్నామని, త్వరలోనే అదుపులోకి తీసుకుంటామన్నారు.

**గంజాయి చాక్లెట్లు..**

సంతోష్ కుమార్ కూలీ పనికోసం నగరానికి వచ్చి మహేశ్వరంలో ఉంటున్నాడు. బీహార్‌కు వెళ్లినప్పుడు అక్కడ గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసి తీసుకుని వచ్చి ఇక్కడ పనిచేస్తున్న కూలీలకు విక్రయిస్తున్నాడు. ఆగస్టులో బీహార్ రాష్ట్రానికి వెళ్లిన నిందితుడు 19ప్యాకెట్ల గంజాయి చాక్లెట్లను కొనుగోలు చేసి తీసుకుని వచ్చాడు. అవసరం ఉన్న వారికి రూ.30లకు ఒక చాక్లెట్‌ను విక్రయిస్తున్నాడు. ఈ విషయం మహేశ్వరం ఎస్ఓటి, ఆదిబట్ల పోలీసులకు తెలియడంతో దాడి చేసి అరెస్టు చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



# యువతి మృతదేహం ముక్కలు చేసి ఫ్రిడ్జ్‌లో..

**బలగం టీవీ , బెంగళూరు**



ఓ యువతి మృతదేహాన్ని ముప్పై ముక్కలు చేసి ఫ్రిడ్జ్‌లో దాచి ఉంచిన సంఘటన బెంగళూరు లోని వ్యాలికావల్ ప్రాంతం అపార్టుమెంట్‌లో శనివారం బయటపడింది. ఆ ఫ్రిడ్జి ఉన్న భవనం నుంచి దుర్వాసన రావడంతో ఇరుగుపొరుగు వారు పోలీసుల దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో పోలీసులు రంగం లోకి దిగి తనిఖీ చేయగా ఫ్రిజ్‌లో మృతదేహం భాగాలు కనిపించాయి. ఎప్పుడో ఈ హత్య జరిగి ఉంటుందని శరీర భాగాలు ఫ్రిజ్‌లో దాచి ఉంచారని అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సతీష్ కుమార్ చెప్పారు. దర్యాప్తులో పోలీస్‌లకు కొన్ని వివరాలు తెలిశాయి. వాస్తవానికి మృతురాలు వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, ఆమె బెంగళూరులోనే ఉంటున్నట్టు తెలిసింది.డాగ్‌స్కాడ్,ఫింగర్ ప్రింట్ టీమ్‌లను రప్పించి క్రైమ్‌సీన్‌లో సాక్షాధారాలు సేకరించారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నిపుణులు కూడా పిలిపించినట్టు సతీష్ కుమార్ తెలిపారు. పోలీస్‌లు మొదట అపార్టుమెంట్‌కు చేరుకుని చూసేసరికి 165 లీటర్, సింగిల్ డోర్ ఫ్రిడ్జ్ ఆన్‌చేసి పనిచేస్తున్నట్టు కనిపించింది. అందులోని మృతదేహాన్ని చాలా వరకు క్రిములు తినేశాయని పోలీస్‌లు చెప్పారు.

# రుద్రంగిలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



**బలగం టీవీ ,రుద్రంగి:**

రుద్రంగి మండల కేంద్రంలో శ్రీ శివ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. పద్మశాలి కుల బాంధవులు సంఘ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి గౌరవ వందనంతో నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలని, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయడంతో పాటు తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. తెలంగాణ కోసం తన మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదిలిన మహనీయుడని కొనియాడారు. చేనేత సహకార సంఘాలకు విశేష సేవలందించిన కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు బాసని ఓం ప్రకాష్, సెక్రటరీ మ్యాకల రమేష్, కోశాధికారి బాసని దయానందం మరియు సంఘ సభ్యులు పడాల శంకరయ్య ,పులి లక్ష్మీరాజం, పడాల సురేష్, కొండ సత్యనారాయణ, పిల్లమారపు ప్రవీణ్, చిప్ప సుధాకర్, ఎలిగేటి ప్రదీప్,పడాల శ్రీధర్, పడాల కృష్ణాహరి,మంచే లక్ష్మణ్, పడాల ఆంజనేయులు, గాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 23న పలు ప్రాంతాలలో నీటి సరఫరా బంద్

**బలగం టీవీ , హైదరాబాద్**

హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే కృష్ణా ఫేజ్-3 రింగు మెయిన్ -1 పరిధిలోని ప్రశాసన్ నగర్ నుంచి అయ్యప్ప సొసైటీ వరకు ఉన్న 1200 ఎంఎం డయా పీఎస్సీ గ్రావిటీ మెయిన్ పైపులైన్‌కు పలు ప్రాంతాల్లో లీకేజీలు ఏర్పడ్డాయి. వీటిని అరికట్టేందుకు మరమ్మత్తు పనులు చేపడుతున్నట్లు జలమండలి అధికారులు ప్రకటించారు.ఈ పనులు ఈ నెల 23వ తేదీ సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి మరుసటి రోజు మంగళవారం ఉదయం 6 గంటల వరకు పనులు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ 24 గంటల పాటు పలు రిజర్వాయర్ల పరిధిలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని చెప్పారు. హకీంపేట, గోల్కొండ. టోలిచౌకి, లంగర్‌హౌజ్, షేక్‌పేట, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, తట్టిఖానా, మాదాపూర్, కొండాపూర్, డోమెన్స్, గచ్చిబౌలి ప్రాంతాల ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోని అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# అఫ్గానిస్థాన్ సంచలనం



**బలగం టీవీ, షార్జా**

ఆఫ్గానిస్థాన్ జట్టు సంచలనం సృష్టించింది. అద్భుతమైన ప్రదర్శనతో దక్షిణాఫ్రికాపై వరుసగా రెండో వన్డేలోనూ గెలుపొంది సిరీస్‌ను కైవసం చేసింది. తద్వారా ఇంకో వన్డే మిగిలి ఉండగానే ప్రత్యర్థి జట్టుపై 2–0తో సిరీస్ కైవసం చేసుకుంది

షార్జా వేదికగా జరిగిన మ్యాచ్‌లో అఫ్గాన్ ఆటగాళ్లు బ్యాటింగ్, బౌలింగ్ రెండిటిలోనూ అద్భుత ప్రదర్శన చేశారు. దీంతో 177 పరుగుల తేడాతో సఫారీ జట్టు ఓటమి చవిచూసింది. దక్షిణాఫ్రికాతో మొదటి మ్యాచ్‌కు దూరమైన అఫ్గానిస్థాన్ స్టార్ ప్లేయర్ రషీద్ ఖాన్ రెండో మ్యాచు బరిలోకి దిగి ఐదు వికెట్లు తీశాడు. రహ్మానుల్లా గుర్బాజ్ సెంచరీ(105 సాధించాడు.

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగింది అఫ్గానిస్థాన్. నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 311 పరుగులు చేసింది. ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ 105 పరుగులు చేసి సెంచరీతో ఆకట్టుకున్నాడు. అజ్మతుల్లా ఓమర్‌జాయ్ 86 పరుగులు, రహ్మత్ షా 50 పరుగులతో రాణించారు. దీంతో అఫ్గానిస్థాన్ భారీ స్కోర్ చేయగలిగింది.

అనంతరం 312 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగింది దక్షిణాఫ్రికా. ప్రారంభంలోనే వరుసగా వికెట్లను కోల్పోయింది. నిర్ణీత 34.2 ఓవర్లలో కేవలం 134 పరుగులు మాత్రమే చేసి ఆలౌటైంది. సౌతాఫ్రికా తరుపున కెప్టెన్ టెంబ బవుమా ఒక్కడే 38 పరుగులు చేసి పర్వాలేదనిపించాడు. అఫ్గానిస్థాన్ బౌలర్లలో రషీద్ ఖాన్ 5 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేశాడు. ఖరోటే 4 వికెట్లతో రాణించాడు. ఈ మ్యాచులో అద్భుతంగా రాణించిన రషీద్ ఖాన్‌కు మ్యాన్ అఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఇకపోతే మూడు మ్యాచుల సిరీస్‌లో భాగంగా నామమాత్రమైన చివరి వన్డే షార్జా వేదికగా ఆదివారం జరగనుంది.

# చెపాక్‌లో సెంచరీల మోత

## శతకాలు సాధించిన పంత్, గిల్..



- **287 పరుగులకు రెండో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన భారత్**
- **బంగ్లాదేశ్ లక్ష్యం 515 పరుగులు**

**బలగం టీవీ, చెన్నై**

బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో టీమ్ఇండియా పట్టు బిగించింది. మూడో రోజు శుభ్‌మన్ గిల్(119 నాటౌట్), రిషభ్ పంత్(109)లు శతకాలతో అదరగొట్టడంతో బంగ్లాదేశ్ ముందు భారత్ భారీ లక్ష్యాన్ని ఉంచింది.

515 పరుగుల భారీ లక్ష్యంతో సెకండ్ ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన బంగ్లా మూడో రోజు ఆట ముగిసేసరికి 158–4తో నిలిచింది. క్రీజులో నజ్ముల్ షాంటో (51 పరుగులు), షకిబ్ అల్ హసన్ (5 పరుగులు) ఉన్నారు. స్పిన్ మాంత్రికుడు రవిచంద్రన్ అశ్విన్ 3, పేసర్ జస్ప్రీత్ బుమ్రా 1 వికెట్ తీశారు.

శుభ్‌మన్ గిల్(119 నాటౌట్), రిషభ్ పంత్(109)ల రికార్డు భాగస్వామ్యంత భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 287 పరుగులు చేసింది. అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మ డిక్లేర్ చేశారు. తర్వాత భారీ ఛేదనకు దిగిన బంగ్లాదేశ్ ఎదురీదుతోంది. అశ్విన్ తిప్పేయగా మూడో సెషన్‌లో నాలుగు వికెట్లు కోల్పోయింది. అయితే.. 10 ఓవర్లు ఉన్నాయనగా వెలుతురు తగ్గపోవడంతో అంపైర్లు మ్యాచ్ నిలిపివేశారు. అప్పటికీ బంగ్లా స్కోర్.. 158 గా ఉంది. భారత జట్టు విజయానికి ఆరు వికెట్లు అవసరం కాగా.. బంగ్లా ఇంకా 357 రన్స్ కొట్టాలి.

# వెంకటేష్ మూవీ సెట్స్‌లో బాలకృష్ణ సందడి



**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ సీనియర్ నటులు నందమూరి బాలకృష్ణ, విక్టరీ వెంకటేష్‌లు ఒకే చోట కలుసుకున్నారు. రామోజీ ఫిలిం సిటీ వేదికగా అనిల్ రావిపూడి – వెంకటేశ్ ప్రాజెక్ట్ షూటింగ్ జరుగుతుండగా.. ఈ సెట్స్‌లో బాలయ్య వచ్చి సందడి చేశాడు.

అనిల్ రావిపూడి – వెంకటేశ్ కాంబోలో వచ్చిన ఎఫ్2, ఎఫ్3 చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో వీరిద్దరి కాంబినేషన్‌లో మరో చిత్రం రాబోతుంది. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో వస్తున్న ఈ చిత్రం కామెడీ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానుంది. ఇప్పటికే తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో ఉన్న దర్బార్ హాల్‌లో ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం రామోజీ ఫిలిం సిటీలో షూటింగ్ జరుపుకుంటుంది. అయితే ఈ సెట్స్‌లో నందమూరి బాలకృష్ణ వచ్చి అందరికి సర్‌ప్రైజ్ ఇచ్చాడు. అనంతరం వెంకటేశ్, అనిల్ రావిపూడితో కలిసి ముచ్చటించారు బాలయ్య. ఇక బాలయ్య సెట్స్‌కి వచ్చిన ఫొటోలను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది.

ఈ ప్రాజెక్ట్‌లో కథానాయికలుగా మీనాక్షి చౌదరితో పాటు ఐశ్వర్య రాజేష్ నటించబోతుండగా.. ఈ మూవీలో ఐశ్వర్య రాజేష్ వెంకటేశ్ భార్యగా నటించనున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాను 2025 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

మరోవైపు బాలకృష్ణ ఎన్‌బీకే 109 అనే సినిమా చేస్తున్నాడు. మెగాస్టార్ చిరంజీవితో వాల్తేరు వీరయ్య వంటి సూపర్ హిట్ అందుకున్న కేఎస్ రవీంద్ర (బాబీ) ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. బాబీ డియోల్ విలన్ పాత్రలో నటిస్తున్నాడు. సితార ఎంటర్‌టైన‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తుంది.

# కాస్టింగ్ కౌచ్ గురించి వింటే బాధేస్తుంది

- **నటి కృతి శెట్టి**



**బలగం టీవీ, హైదరాబాద్**

కాస్టింగ్ కౌచ్ వ్యవహారాల గురించి వెంటే బాధేస్తుందని నటి కృతి శెట్టి అన్నారు. తనకు వ్యక్తిగతంగా అలాంటి చేదు అనుభవాలు లేవని, ఇలాంటి ఘటనల గురించి విన్నప్పుడు మానసికంగా చాలా బాధగా అనిపిస్తోందని అంటోంది. "మీటూ అనుభవాలు ఒక్కొక్కరు చెబుతుంటే చాలా బాధగా ఉంది. నేను చాలా సెన్సిటివ్. ఇలాంటివి విన్నప్పుడు వ్యక్తిగతంగా చాలా బాధేస్తోంది. చాలామంది కాస్టింగ్ కౌచ్ బారిన పడిన ఘటనలు వింటున్నాను. దీనిపై ఉద్యమం మొదలైంది. ఫిలిం ఇండస్ట్రీలో పాజిటివ్ మార్పు వస్తుందని ఆశిస్తున్నాను"అని అన్నారు. తమ మలయాళ సినిమా ప్రమోషన్ లో భాగంగా నేషనల్ మీడియాతో మాట్లాడిన కృతి శెట్టి.. ప్రజలకు దీనిపై ఇప్పుడిప్పుడే అవగాహన [illegible] అభిప్రాయపడింది. ఒకప్పుడు హీరోయిన్లను చాలా తప్పుడు కోణంలో చూసేవారని, ఇప్పుడు వాళ్లు కూడా మహిళా ఆర్టిస్టుల బాధను అర్థం చేసుకుంటున్నారని అంటోంది.